రథయాత్ర

పోలవరపు కోటేశ్వరరావు

వైశాఖ మాసం.

ఎండ భరించటం చాలా కష్టంగా వుంది. వడగాలికి భయపడి ఎవరూ బయటికి రావటం లేదు. పిల్లలకు ఇవేమీ పట్టటం లేదు ఏటి నీళ్ళల్లో దూకి ఈదుతున్నారు. వడ్డెక్కి పొలాల మధ్యగా పరుగులు తీసి మామిడి తోటల దగ్గరకు చేరుతున్నారు కాపలావాడిని మంచి చేసుకునో, మభ్యపెట్టో పచ్చికాయలు సంపాదించి ఉప్పూ కారమూ అద్ది ఆరగిస్తున్నారు.

ఈ రోజు నారాయణకు తీరిక లేకుండా వుంది. స్నేహితులతో కలిసి గుసగుసలాడుతున్నాడు.

ఎలాగైనా రాత్రికి శ్రీకాకుళం వెళ్ళి రథోత్సవం చూచిరావాలి.

రంగన్న, సీనూ, రాముా వచ్చారు.

అంతా చావడిలో చేరారు.

"నారీ అన్నా! మా నాయన వప్పుకున్నాడు" అన్నాడు రంగయ్య.

"సీనూ, మీ అమ్మ ఏమందిరా?" నారాయణ అడిగాడు.

"వప్పుకోవటంలేదు-" వాడు నిరుత్సాహంగా చెప్పాడు.

రాముా కూడా 'లాభంలే'దన్నాడు.

"ఎలాగైనా వెళ్ళి చూడాలన్నా" అన్నాడు సీను.

"రాత్రి కళ్యాణం దగ్గర కాంగ్రెస్‌వాళ్ళు గొడవ చేశారని మా అమ్మ కూడా వీల్లేదంటోంది"

"ఏం చేద్దాం?"

అంతా ఆలోచించారు. అమ్మనీ, నాన్ననీ బతిమాలి అనుమతి సంపాదించాలనుకున్నారు.

"ఒకవేళ వప్పుకోకపోతే ఎలాగన్నా?"

నారాయణ ఈ నలుగురిలో పెద్దవాడు. అతని మాటంటే అందరికీ నమ్మకం.

"సీనూ! రాత్రిపూట గొడ్ల దగ్గర చావిడిలో పండుకుంటావుగదా!"

"ఔనన్నా..."

"పెందరాడే అన్నం తిని చావిడి దగ్గరకొచ్చెయ్. అక్కడి నుండి అంతా కలిసివెళ్దాం."

ఈ ఆలోచన అందరికీ నచ్చింది.

చీకటిపడే సమయానికి నారాయణ తల్లిని వప్పించాడు. నారాయణ తల్లికి దైవభక్తి ఎక్కువ. అందువల్ల ఇలాంటి విషయాలలో ఆమె వద్దనదు. కానీ, ఈ సంవత్సరం పరిస్థితి వేరుగా వుంది. ఈ మధ్యనే తెనాలిలో కాంగ్రెస్‌వాళ్ళు గొడవ చేశారట. రాత్రి శ్రీకాకుళంలో పోలీసులు లాఠీలతో కాంగ్రెస్ కార్యకర్తలను కొట్టారని తెలిసింది. ఈ రోజు రథోత్సవం. మళ్ళీ ఏమవుతుందోననే భయం.

కాని, కొడుకు బతిమాలుతుంటే, కాదనలేక వప్పుకుంది.

నారాయణ చొక్కా-లాగూ కొత్తవి వేసుకుని బయలుదేరాడు.

తల్లి ఇచ్చిన బేడా జేబులో దాచుకున్నాడు. అతనికి చాలా సంతోషంగా వుంది. బేడా అంటే రెండణాలు. ఎనిమిది కానులు. ఇరవై నాలుగు దమ్మిడీలు. దమ్మిడీ పెడితే పకోడం కొనుక్కోవచ్చు. చక్కెరకడ్డీ కొనుక్కోవచ్చు. కానీ పెడితే చెరకు ముక్క వస్తుంది.

రంగన్న వచ్చి కలిశాడు. ఇద్దరూ గొడ్లచావిడి వద్దకు వెళ్ళారు. సీనూ, రాముా అక్కడే వున్నారు. నలుగురూ, ఎవరికీ కనపడకుండా లంక దిగి ఇసుకలోకి వెళ్ళారు.

"యేరుకాల్వదవ తప్పిందంట" సీను అన్నాడు.

"కార్తి లెక్కేలే లోతుగా వుండేది"

"ఎప్పుడూ లేంది ఈ యేడు పోలీసుల గొడవొచ్చిపడింది"

"అంతా ఆ కాంగ్రెస్‌వాళ్ళ మూలానే-"

"కాంగ్రెసువాళ్ళంటే?" సీనూ అడిగాడు.

"తలమీద టోపీ పెట్టుకుని, ఇద్దరు పంచె కట్టుకుని, మూడు రంగుల జెండా పట్టుకుని మన వూళ్ళు వస్తుంటారు. వాళ్ళని చూడలేదా?"

"చూశాను."

"వాళ్ళే"

"వాళ్ళు మంచివాళ్ళేగా"

"ఔను.."

"మొన్న అనంతారం నుండి భాష్యం అని ఒకాయన వచ్చాడు. ఆయనతో యింకా చాలామంది జెండాలు పట్టుకుని జేజేలు కొడుతూ మన వూరంతా తిరిగారు-" అన్నాడు రాము.

"వాళ్ళతో సిపాయి బాబాయి కూడా వచ్చాడు" రంగన్న అందుకున్నాడు.

"వాళ్ళేం చేస్తారు?"

"నాకు తెలవదు.." అన్నాడు రంగన్న

"నాకూ తెలవదు" అన్నాడు సీను.

"నీకు తెలుసా నారాయణా?"

నారాయణ ఏదో ఆలోచిస్తున్నాడు. వెంటనే సమాధానం చెప్పలేదు.

"వారీ అన్నా! నీకు తెలుసా?" సీనూ అడిగాడు

"కొద్దిగా తెలుసు.."

"వాళ్లెవరు?"

"మనవాళ్లే. గాంధీగారు వారికి పెద్ద నాయకుడు. వీళ్లంతా మన దేశానికి స్వాతంత్ర్యం రావాలని పోట్లాడుతున్నారు."

"నీకెట్టా తెలుసన్నా?"

"తెనాలి నుండి మా యింటికి చుట్టాలు వచ్చారు. వాళ్ళు చెపుతుంటే విన్నాను. అక్కడ పోలీసోళ్లతో పోట్లాడారని మా అమ్మ చెప్పింది. సీనూ అన్నాడు. ఎవరో సైమన్ అనే ఆయన రైల్లో వస్తుంటే, వెనక్కు పో, రావద్దు అన్నారంట.."

"ఎవరన్నారు?"

"కాంగ్రెసువాళ్లు"

"ఏమయింది?"

"పోలీసులొచ్చి లాఠీలతో చితకబాదారంట.."

వాళ్లకు సరిగా అర్థం కాలేదు.

వాళ్లు నలుగురూ మెత్తని యిసుకమీద చకచకా నడుస్తున్నారు.

బుసకలో కాళ్లు పెగలటం లేదు. గరప యిసుకమీదకు వచ్చి, లంక ఎక్కారు. ఎదురుగా ఏటికట్టపైగా, తుమ్మలమీదుగా చందమామ నవ్వుతూ కనిపించాడు.

దేవాలయం నుండి షన్నాయి వినిపిస్తోంది. డోలు వరుసలు మ్రోగుతున్నాయి. బాకాలు ఊదుతున్నారు.

ఆ వాయిద్యాలు వినిపించటంవలన స్నేహితులకు మహదానందంగా వుంది.

నలుగురూ పోటీపడి పరుగులు తీశారు. రొప్పుకుంటూ నీటి అంచుకు వచ్చి ఆగారు.

ఆ వెన్నెట్లో వెండి తరగలతో కృష్ణవేణి వయ్యారంగా పరుగులు తీస్తోంది. సముద్రపు గాలికి చిరుకెరటాలు నీటి జాలుకు ఎదురెళుతున్నాయి. వల్లగాలి పరామర్శిస్తోంది.

నారాయణతో కలిసి అంతా లాగూ-చొక్కాలు వూడదీశారు. జాగర్తగా వాటిని తలకు చుట్టుకున్నారు. కాలినడవ తప్పినా, యిక్కడ నదిలో మెరకగా వుంది. ఉత్సవాలకు వెళ్లేవారి ఉపయోగం కొరకు నదిలో దారి పొడవునా పుల్లలు పాతి వున్నాయి.

''ఒకరి మొలతాడు మరొకరు పట్టుకోండి. జాగర్తగా నా వెనుకనే రండి''- అన్నాడు నారాయణ.

అందరూ ఒకర్ని వెనుక ఒకరు నడుస్తున్నారు.

ఆ వేసవి ఎండకు నీటి పైపొర వేడిగా వుంది. లోన వల్లగా నీరు ప్రవహిస్తోంది. తొడలోతు వచ్చాక సీనూ అడిగాడు- ''అన్నా! కొంచెమాగు. మంచినీళ్ల తాగుతా.''

అంతా ఆగిపోయారు.

రెండు చేతులతో పైనీటిని అటూ యిటూ నెట్టి, దోసిళ్లతో కడుపారా త్రాగారు.

''అబ్బ! ఎంత వల్లగా వున్నాయో మావావా?'' అన్నాడు, రాము.

''పంచదార కలిపినట్టుంది'' సీనూ మరో గుక్క త్రాగి అన్నాడు.

''ఔను! దేముడు ఈ నది నిండా బెల్లం కలుపుతాడట. అందుకే కృష్ణ నీరు యింత తీయగా పానకంలా వుంటుందని మా తాత చెప్పాడు'' అన్నాడు రంగన్న.

అంతా నిజమే నసుకున్నారు.

నదిలో నడుస్తున్నారు. బొడ్డులోతు దాటింది. మరో పది అడుగులేసేసరికి రొమ్ములోతు అయింది. అందరిలోకీ చిన్నవాడు రంగన్న. నారాయణ భుజం పట్టుకుని నడుస్తున్నాడు.

కాళ్ళ క్రింద యిసుక కదరిపోతోంది. కాలుతీసి కాలు వేయటానికి నేలమీద పట్టు దొరకడం లేదు. వడి ఎక్కువగా లేకపోయినా పిల్లలకు కష్టంగానే వుంది. ప్రయాసపడి నది దాటారు.

రంగన్న లాగూ తొడుక్కుంటూ ''నాకు బలే భయమేసింది అన్నా'' అన్నాడు.

నారాయణ వాడి తలమీద మొట్టికాయవేసి, ''పిరికి సన్నాసివిరా! నా భుజం పట్టుకుని కూడా భయమేసిందా. ఇంకా నయం నన్ను వాటేసుకుంటే యిద్దరం మునిగిపోయేవాళ్లం'' అన్నాడు.

పిల్లలు నలుగురూ కేరింతలు కొట్టుకుంటూ ఏటికట్ట ఎక్కారు.

కట్టకానుకుని శ్రీకాకుళం వుంది. గ్రామం మధ్యగా విశాలమయిన బజారు. జనం కిటకిట లాడుతున్నారు. దేవాలయం దగ్గరలో సందడి హెచ్చుగా వుంది. వెనుకనున్న ఆంజనేయస్వామి దేవాలయం వరకూ నులక మంచాలు పరచారు. వాటిమీద దుప్పట్లువేసి, పళ్లేలు వుంచారు. వాటినిండా మిఠాయి, కారప్పూస, పకోడి నింపి అమ్ముతున్నారు. మరోవైపు అరటిపళ్ళు, కొబ్బరి కాయల దుకాణాలున్నాయి. జాడీల కొట్లు, బట్టల కొట్లు వరుసగా వున్నాయి. జనం మంచాల చుట్టూ చేరి కావలసినవి కొనుక్కుంటున్నారు.

పిల్లలు తలా ఒక రకం పొట్లాలు కట్టించి, చేతులతో పట్టుకున్నారు. వాటిని పంచుక తింటూ దేవాలయం ముందుకు వెళ్లారు.
గుళ్లో ప్రవేశించారు. మంగళవాయిద్యాల మోతలతో దేవాలయ ప్రాంగణం ఆనందంగా వుంది. భక్తులంతా ఉత్సాహంగా వున్నారు. గర్భగుడిలో గుడిగంటలు అవిశ్రాంతంగా మోగుతున్నాయి. దైవదర్శనం కొరకు తోపులాట ఎక్కువగా వుంది.
నారాయణ చుట్టూ తప్పిపోకుండా నిలచిన ముగ్గురూ మునికాళ్లమీద లేచి తమ ముందున్నవారి భుజాలపైగా కాకుళేశ్వరస్వామిని చూచారు. ఎగిరెగిరి గంట మోగించారు. రంగన్నకు గంట అందలేదు. నారాయణ వాడిని ఎత్తిపట్టుకుని గంట కొట్టించాడు.
వాళ్ల కళ్ల మెరిసిపోతున్నాయి
ముఖాలు వెలిగిపోతున్నాయి.
గుండెలు ఆనందంతో పొంగిపోతున్నాయి.
జనాన్ని తోసుకుని బయటికి వచ్చారు.
కళ్యాణ మంటపంమీదకు వెళ్లారు. గుడిచుట్టూ తిరిగారు. ధ్వజస్తంభంమీది జెండాను చూచారు. వేలాడుతున్న చిలుకను చూచారు. చిరుగాలికి మోగుతున్న ధ్వజస్తంభపు గంటలను చూచారు. అంతా ఆశ్చర్యమే! అంతా ఆనందమే!
గాలిగోపురం ముందున్న రథానికి అలంకరణ పూర్తిఅయింది. వాళ్ల అపుడపుడూ చూస్తున్న రథమే. కాని ఈ రోజు కొత్తగా వుంది. దుమ్ము దులిపి రంగులు వేశారు. దుప్పట్లు కప్పి, తోరణాలతో నింపారు. రెండు పొడవాటి మోకులు చుట్టలు చుట్టి రథం ముందు వేసి వున్నాయి.
అంతా సంతోషంతో రథచక్రాల ప్రక్కన నిలిచారు.
వాళ్లకు బూరల మోత వినపడింది.
అక్కడ నిలబడి రథాన్ని చూస్తున్న జనం భయపడుతూ ప్రక్కకు తప్పుకున్నారు. పిల్లలు ముగ్గురూ బెంగారుగా నారాయణ చేయి పట్టుకున్నారు. అందరూ దూరంగా వెళ్ళి చెరువు గట్టున చెట్టుక్రింద నిలిచారు.
పోలీసులు యూనిఫారంలో వచ్చి అక్కడక్కడ నిలబడ్డారు.
వెన్నెట్లో ఆ కాకీ బట్టలు వెలవెలబోతున్నాయి.
దేవాలయంలో నుండి వాయిద్యాలు మోగిస్తూ ఉత్సవ విగ్రహాలు తెచ్చారు. సర్వ వాయిద్యాలూ జ్వరం వచ్చినట్టు అరుస్తున్నాయి. ఎవరి వరుస వారిదే. ఎవరి తాళం వారిదే. అంతా మోతలతో నిండిపోయింది. కాగడాలు కొండెగడుతున్నాయి. నూనెపోసి జీవం పోస్తున్నారు.
బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు. వింజామరలతో విసురుతున్నారు. పలు రకాల గొడుగులు, శంఖు చక్రాలు వెంట తీసుకువస్తున్నారు. రథంమీద విగ్రహాలను పీఠంపైన వుంచి, కదలకుండా బిగించారు. పిల్లలూ, పెద్దలూ భయం భయంగా రథం దగ్గరకు వచ్చారు. టెంకాయలు కొట్టి కాకుళేశ్వరునికి జయజయధ్వానాలు పలికారు. రథానికి ప్రక్కల కాగడాలు పట్టుకుని కూర్చున్నారు. పూజారుల వల్లని శరీరాలు ఆ వెలుతురులో నిగనిగలాడుతున్నాయి. వారి ముఖాలు కళావిహీనంగా వున్నాయి. వారి ఫాలతలం మీది వైష్ణవ నామాలు మెరుస్తున్నాయి.
జనం మోకులు పట్టుకున్నారు.
బాకాలు బావురుమన్నాయి.
డోలూ, సన్నాయి వరుసలు పలికాయి.
సన్నాయి నొక్కులు వినిపించాయి.
బేండుమేళం ధమధమలాడింది.
తాసామర్ఫాలు చెవులు గింగురుమనిపించాయి.
రథం ముందు వండిన అన్నం బలిహారంగా పోశారు.
రథపూజ జరిగింది. దేవునికి హారతి యిచ్చారు.
దేవదాసీలు నృత్యం చేస్తున్నారు.
'గోవిందా! గోవిందా!!' అంటూ మోకులు లాగారు.
రథం కదిలింది.
మబ్బులులేని ఆకాశం నుండి భయంకర ధ్వనులతో పిడుగు పడినట్లు ఎక్కడి నుండో నినాదాలు వినిపించాయి.
"మహాత్మా గాంధీకీ జై"
వాళ్లనుగూర్చి ఆలోచన రావటంతోటే ఆగిపో యాడు. అన్నివైపులా చూచాడు. నెమ్మదిగా ఒక చెట్టు చాటు చేసుకుని నిలబడ్డాడు. పైన వెన్నెల చిమ్ముతోంది. నడిగాలికి లేచిన ఎండుటాకుల్లా జనం పారిపోతున్నారు. కాని ఆ నినాదాలు ఆగటంలేదు.
పోలీసులకు అర్థం కావటంలేదు.
నారాయణ అలాగే నిలిచి చూస్తున్నాడు. ఎవరో భుజంమీద చేయివేసి ప్రక్కనే నిలిచారు. నారాయణ అతనివంక చూచాడు. ఆ వ్యక్తి ఆప్యాయంగా తనను చూస్తున్నాడు. ఆకుల మధ్య నుండి వెన్నెల కిరణాలు వచ్చి అతని ముఖంమీద నాట్యం చేస్తున్నాయి.
"భయం వేస్తోందా?" ఆ వ్యక్తి అడిగాడు.
నారాయణ సమాధానం చెప్పలేదు. పోలీసుల వంక చూస్తున్నాడు.



"కాంగ్రెస్ పార్టీ జిందాబాద్, బోలో స్వతంత్ర భారత్‌కు జై"
రథానికి అన్నివైపుల నుండీ యివే నినాదాలు.
సర్వవాయిద్యాలూ ఆగిపోయాయి. రథం లాగడం మరచిపోయిన భక్తులు ఆశ్చర్యంతో అన్ని వైపులా చూస్తున్నారు. భయంతో నిలిచిపోయారు.
పోలీసు బలగం పరుగులు తీసింది. అన్నివైపులకూ ఆగకుండా దూకింది.
ఒక చినుకు పడితే ఆపుకోవచ్చు. వానపడితే గొడుగు వేసుకోవచ్చు. తుఫాను సాగితే ఏ ఆచ్ఛాదనా ఆపలేదు. జన ఘోషతో, నినాదాలతో ఆ గుడిముందు తుఫానులా వుంది. పోలీసులవల్ల అది ఆగేటట్టు లేదు.
వారి చేతుల్లోని లాఠీలు లేచాయి. జనంమీద విరుచుకపడ్డాయి. అందినవాళ్ళనందినట్టు బాదాయి.
నిలచి చూస్తున్న నారాయణ వీపుమీద లాఠీ మోగింది.
ఆ దెబ్బకు అదిరిపోయి కాలుకుందికీ పరుగెత్తాడు. ఆగకుండా చెరువుగట్టు దాటి పొలాల్లోకి వెళ్లాడు. రంగన్నా, సీమా, రామూ ఏమైనారో తెలియదు.
"భయపడి పారిపోతే దెబ్బలు తప్పుతాయా? చూడు ఆ మూర్ఖులు ఎలా బాదుతున్నారో? ఈ పిరికిపందలు ఎందుకు పారిపోవాలి? ఒక్కడు కూడా ఎదురు తిరగడం లేదు" ఆ వ్యక్తి అన్నాడు.
నారాయణ ఆశ్చర్యపోతూ అతన్ని పరిశీలనగా చూశాడు. లాఠీలు తగిలి పడిపోయినవారి హాహాకారాలు వినిపిస్తున్నాయి. పోలీసులు బూతులు తిడుతూ, బూటు కాళ్లతో తన్నుతున్నారు. ఏడ్పులు, కేకలు, నినాదాలు- అంతా బీభత్సంగా వుంది.
నారాయణ గుండె దడదడలాడుతోంది. కానీ ప్రక్కనే నిలిచి ధైర్యంగా నిలబడి మాట్లాడుతున్న అతని ప్రశాంత వదనం ధైర్యాన్నిచ్చింది.
"ఈ జాతి ఎదిరించడం ఎప్పుడు నేర్చుకుంటుందో?" అతను తనలో తాను అనుకుంటున్న మాటలు నారాయణ విన్నాడు.
"వాళ్ల చావబాదుతుంటే ఏం చేయాలి?" నారాయణ అడిగాడు.
ఆ వ్యక్తి ఏమీ చెప్పలేదు. వచ్చి, ముందుకు వెళ్ళాడు.

చెట్టునుంచి చెట్టుకి



ఇలాఇక్కడికి వచ్చేశాను
మా ఊళ్లో బోలేడు మర్రిచెట్లు
పక్కనించి పోతున్నా పలకరించి
గలగల కబుర్లాడే రావిచెట్లూ

ఒంటిగా ఉన్నప్పుడు ఎప్పుడూ
పడవ కుదుపులా
బడి ఊయలలా
మర్రి ఊడల ఊయల ఊపులు
కుదుపుతూంటాయి

ఇప్పు డెప్పుడేనా మళ్లీ ఊరెల్లి
ఊడలు ఊగుదా మనుంటుంది

ఎందు కంటావా?
మా కొత్త ఇంటిముందు అన్నీ
అశోకవృక్షాలే, ఏవుగా
ఒంటిగా ఎదిగిపోయి......

— తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

నారాయణ ఆశ్చర్యపోతూ చూస్తున్నాడు.
సన్నగా, నల్లగా వున్న ఆ యువకుడు ముతక ఖద్దరు కట్టుకున్నాడు. గోచీ బిగించి, కుచ్చీలు పైకి దోపుకున్నాడు. జేబులో కాంగ్రెస్ జెండాలున్నాయి. అతను చకచకా రథంవైపు వెళ్తున్నాడు.
పోలీసులు జనాన్ని తరిమి తరిమి అలసిపోయారు. లాఠీలతో బాది బాది చేతులు పీకుతున్నాయి. నెమ్మదిగా ఒకచోటుకు చేరి, నిలబడి చూస్తున్నారు.
ఆ యువకుడు నిర్భీతిగా రథంవద్దకు వెళ్ళి, పైకి ఎక్కాడు. పూజారులు బిక్కుబిక్కుమంటూ అతనివైపు చూస్తున్నారు.
''ఆచార్యులవారికి నమస్కారం'' అన్నాడు ఆ వ్యక్తి.
పూజారులు మాట్లాడలేదు. భయపడుతూ అతనివైపు చూసి తమనేమీ చేయడనే నిర్ణయానికి వచ్చారు. ఐనా వారికి బెదురు పోలేదు. వణుకుతున్న చేతులతోనే నమస్కరించి, ముడుచుక కూర్చున్నారు.
ఆ యువకుడు రెండు త్రివర్ణ పతాకాలను రథానికి రెండువైపులా కట్టాడు.
వెన్నెలలో అవి నవ్వుతున్నాయి. లలితంగా కదులుతున్నాయి. గాలికి ఆనందంగా ఆడుతున్నాయి. పోలీసులవంక చూసి పకపక నవ్వుతున్నాయి.
ఆ వ్యక్తి కాగడా చేతిలో పట్టుకుని, రథంమీద ముందువైపుకు వచ్చి నిలబడ్డాడు. నారాయణవైపు కాగడా చూపుతూ, నాయుడువైపులా చూశాడు.
''మహాత్మా గాంధీకీ- జై'' అంటూ నినదించాడు.
పిడుగుపాటుగా ఆ నినాదం గాలిలో కదలింది. అతను వెంట వెంటనే నినదిస్తున్నాడు. పిడికిలి బిగించి, సింహంలా గర్జిస్తున్నాడు.
దూరంగా నిలబడిన పోలీసులు ఆశ్చర్యపోతూ చూశారు. పారిపోతున్న జనం నిలిచిపోయారు. తమ కళ్ళని తామే నమ్మలేకపోతున్నారు. రథానికి రెండువైపులా త్రివర్ణ పతాకాలు ఎగురుతూ వున్నాయి.
రెపరెపలాడుతున్నాయి.
త్రుళ్ళిపడుతూ కేరింతలు కొడుతున్నాయి.
విజిళ్లు వినిపించాయి. తాము చేసిన పొరపాటును అర్థం చేసుకున్న పోలీసులు రథాన్ని కాపాడలేకపోయినందుకు ఖిన్నులయ్యారు.
వారిపైనున్న ఆఫీసరు హుంకరించాడు. చేతిలో పిస్తోలు పట్టుకుని బూతులు తిడుతూ నిలబడ్డాడు.
లాఠీలన్నీ రథం చుట్టూ చేరాయి.
నిర్భీతితో ఆ యువకుడు నినాదాలిస్తూనే వున్నాడు.
దూరంగా పారిపోయిన జనం గొంతు కలిపి నినదిస్తూ రథంవైపు రాసాగారు.

దీపావళి శుభాకాంక్షలతో

ఎల్లప్పుడు శ్రేష్ఠమైన
సర్వేశ్వర వక్కపొడి
వాడండి

SCENTEDNUT

సర్వేశ్వర కాటేజ్ ఇండస్ట్రీస్
మట్టెవాడ చమన్ - వరంగల్ - 2

సుగంధ పరిమళాల
సమ్మేళనము
సర్వేశ్వర వక్కపొడి

భోజనానంతరం తాంబూల సేవన
ఆరోగ్యకరం

ఎల్లప్పుడు
సర్వేశ్వర వక్కపొడినే
వాడండి.

తయారు చేయువారు:
సర్వేశ్వర కాటేజ్ ఇండస్ట్రీస్
మట్టెవాడ చమన్,
వరంగల్ - 506 002

నారాయణకు యిదంతా అగమ్యగోచరంగా వుంది. అతను చెట్ల చాటుగా సాధ్యమైనంత దగ్గరలోకి వచ్చి నిలబడ్డాడు. పైన నిలచిన వ్యక్తిని పోలీసులు క్రిందకు తోశారు. అతను పడిపోతూ రథపుటంచు పట్టుకుని, క్రిందకు జారాడు.

పోలీసులు కమ్ముకున్నారు.

లాఠీలు మ్రోగాయి. బూట్ల కాళ్ళు కుమ్మాయి.

చివరకు అలసిపోయి లాఠీలు ఆగాయి.

ఆ యువకుని వళ్లంతా హూనమయిపోయింది. దెబ్బలు పడని చోటు లేదు. రక్తంతో అతని చొక్కా, పంచె తడిశాయి. దుమ్ములో నుండి లేచి, దెబ్బతగిలిన తలను చేత్తో పట్టుకున్నాడు. ధారగా వస్తున్న రక్తాన్ని ఆపుకుంటూ, మరో చేత్తో పిడికిలి బిగించి "మహాత్మా గాంధీకి జై" అన్నాడు మళ్ళీ!

అంతే! లాఠీలు మళ్లీ విరుచుకుపడ్డాయి. వాటికి చోటు చాలలేదు. రక్తం చింది కాకీలమీద పడింది.

అతను "మహాత్మా గాంధీకి జై" అంటూనే వున్నాడు. ఆ స్వరం బలహీనపడి గొంతుదాటి పెగలటం లేదు. ఆ యువకుని శక్తి తరిగిపోతోంది. అయినా పెదవులు కదులుతూనే వున్నాయి.

పెద్ద ఆఫీసరు వచ్చాడు.

పోలీసులు తొలిగి శాల్యూట్ చేశారు.

"యీ నా కొడుకును యిట్లా కాదు. ఆ కాళ్లమీద కొట్టండి. నా కొడుకు! కుంటి బతుకు బతకాలి"

ఆ ఆఫీసరు ఆజ్ఞ శిరసాపాలించారు. ఆ దేశభక్తుని కాలు విరిగిపోయింది.

చూసేవాళ్లకు గుండెలు చెరువయ్యాయి.

కన్నులు కొలనులయ్యాయి.

హృదయాలు బాధతో సుడులు తిరిగాయి.

నారాయణ చూస్తూ నిలబడిపోయాడు.

క్రౌర్యంతో మీసాలు మెలిపెడుతున్న ఆఫీసరువంక చూసి ఘాండ్రించి వూశాడు. కాని కదలటానికి కాళ్ళు సహకరించటంలేదు. ఎన్నో తాళ్లతో కట్టివేసినట్టుంది. ఆ యువకుని వంక చూస్తూ నిలబడ్డాడు.

తాను దెబ్బలు తింటానని తెలిసి కూడా అతనాపని ఎందుకు చేశాడు? తనను ఎదురించమని చెప్పినదాని అర్థం దెబ్బలు తినటమనేనా? పాపం! కాలు విరిగిపోయింది. లేవలేక లేవలేక లేస్తున్నాడు. అయ్యో! మరల పడిపోయాడు. ఒక్క పోలీసు కూడా సహకరించటం లేదే! నారాయణ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

పోలీసులు బూట్లు టకటకలాడించుకుంటూ అక్కడి నుండి వెళ్ళి, ఆఫీసరు ముందు నిలబడ్డారు.

రథోత్సవం ఆగిపోయింది.

రథచక్రాలు మెత్తగా కదలటానికి వేసిన నూనె ఒక్కో బొట్టు నేలమీద పడుతోంది. ప్రాణం లేని దేవుని రథం కూడా జాలితో కన్నీరు కారుస్తోంది. కాని, ఆ పోలీసు మంద తెల్లదొరల వూడిగాని కలవాటుపడి తమవారిని నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నారు. జమిందారీ గ్రామాలలో కాంగ్రెసు భావాలు ప్రవేశించటం చల్లపల్లి రాజాకు యిష్టం లేదు. తనను ఎవరు ఎదిరించినా వారికి పట్టే గతి యేమిటో చూపించదలచాడు. దానికి యీరోజు జరిగిన క్రూర హింసాకాండ నిదర్శనంగా నిలచింది.

నారాయణకు ఏదో సత్తువ వచ్చింది. పరుగున వెళ్ళి ఆ వ్యక్తిని పట్టుకుని కూర్చోబెట్టాడు. అంతులేని బాధలో వుండి కూడా. ఆ యువకుడు కళ్లెత్తి చూడటానికి ప్రయత్నించాడు. ఒక కన్ను దెబ్బతిన్నది. రెండో కనురెప్ప కదిలింది. అతను చూచాడు. గుర్తుపట్టాడు. పెదవులపై చిరునవ్వుతో నారాయణ చేయి సవరించాడు. ఆ పున్నమి మరునాటి వెన్నెల క్రింద రక్తపు మరకలతో నిండిన అతని ముఖంలో ప్రశాంతత వుంది. గుండె నిబ్బరం వుంది. ఈ దేశానికి తను ఎంచుకున్న అహింసా మార్గంలో సేవ చేస్తున్నాననే సంతృప్తి వుంది.

అతను తూలి పడిపోయాడు.

నారాయణ అతన్ని తన రొమ్ము కానించి కూర్చోబెట్టుకున్నాడు. ఎవరో మంచినీళ్లందించారు. నారాయణ



నెమ్మదిగా త్రాగించాడు. నలుగురు సాయంపట్టి దేవాలయపు ప్రహరీ గోడకానించి కూర్చోబెట్టారు.

మరలా పోలీసులు టకటకలాడుతూ వచ్చారు.

జనం ఎడంగా వెళ్ళి నిలచి చూస్తున్నారు. ఈమాటు పోలీసులు లాఠీలు ఆడించలేదు.

ఆ వ్యక్తిని మోసుకుపోయారు.

నారాయణ ఏటికట్టమీదకు వచ్చాడు. మిగతా మిత్రులు అక్కడ కలిశారు.

సీను అన్నాడు- "అన్నా! నాకు భయంగా వుంది"

నారాయణ అతన్ని దగ్గరకు తీసుకుని "ఎందుకు" అన్నాడు.

"పోలీసులు కొడుతుంటే చూచాను. అప్పటి నుండి నా కాళ్లు వణుకుతున్నాయి"

"భయం దేనికిరా? అన్ని దెబ్బలు తిన్న ఆయనే భయపడలేదు. ఏ దెబ్బా తినకుండానే భయపడిపోవటం దేనికి?"

"వెళ్లిపోదామన్నా.."

"పదండి"

ఏటి అంచుకొచ్చి కూర్చున్నారు. ఎవరూ మాట్లాడలేదు. నారాయణ అన్నాడు. "ధైర్యమంటే అతనిదే. మనము కూడా అంత ధైర్యంగా వుండాలి"

రంగన్న అప్పటివరకూ మాట్లాడలేదు. అతనికున్న అనుమానాన్ని వెళ్లబుచ్చాడు. గాంధీజీ అనే ఆయన యింకా ధైర్యంగా వుండివుంటాడు.

"గాంధీ అంటే ఎవరు?" అందరూ నారాయణను అడిగారు.

"నాకూ తెలియదు"

"ఎందుకు అలా దెబ్బలుతినటం?"

"ఆ జెండా కట్టినందుకు. బోలో స్వతంత్ర భారత్‌కీ జై అన్నందుకు"

"యివన్నీ ఎందుకు చేయాలి?"

"తెలియదు"

వాళ్లకు వెళ్లేటప్పుడున్న సంతోషం యిప్పుడు లేదు. వాళ్ల జోరు జారిపోయింది. ఆందోళన ఆవహించింది. వాళ్ల చిన్న బుర్రలనిండా ఎన్నో ప్రశ్నలు బయలుదేరాయి. కాని, వాటికి సమాధానాలు దొరకటంలేదు.

"అన్నా!"

"చెప్పు"

"తెనాలిలో కూడా యిలాగే కొట్టివుంటారు."

"ఔననుకుంటా."

"తెనాలి అనే ఏముంది. ఎక్కడైనా పోలీసులు యిలాగే బాదేస్తారు." మరో కుర్రాడు సమాధానం చెప్పాడు.

"మనకు తెలియనిదేదో వీళ్లంతా కావాలంటున్నారు. అది పోలీసులకిష్టం లేదు. రాజాకిష్టం లేదు. అందుకే ఈ దెబ్బలు."

అంతా ఔననుకున్నారు.

మరలా యేరు దాటారు. చొక్కాలు విప్పుతున్నపుడు నారాయణ తనకు అయిన రక్తపు మరకలు చూచాడు. అంతవరకూ అతనికీ విషయమే పట్టలేదు.

ఆ మరకలు చూస్తూ అతను ఆవేశపడ్డాడు.

"అరే! మీరంతా జై అనండిరా!" అన్నాడు.

తాను ఆ రక్తసిక్తమైన చొక్కాను చేత్తో పట్టుకుని, జెండా మాదిరిగా గాలిలో ఎగరవేశాడు, ఆవేశంతో.

"మహాత్మా గాంధీకీ- జై"

"కాంగ్రెస్ పార్టీ- జిందాబాద్."

వాళ్ల వోపిక కుందికీ అరుస్తున్నారు.

ఏరు దాటటానికి వచ్చిన జనం కూడా గొంతులు కలిపారు. అంతకంతకూ జనం ఎక్కువయ్యారు.

యిదంతా చూచిన నడినెత్తిన చంద్రుడు నవ్వుకుంటున్నాడు.

ఆ నినాదాలు పెరుగుతూనే వున్నాయి.

ఆ యిసుక తిన్నెల పైగా నలువైపులకూ పరుగులు తీస్తున్నాయి.

కృష్ణవేణి హృదయంమీదుగా సాగిపోతున్నాయి.

బంగారు పండించే లంక భూములను తాకుతున్నాయి.

నిర్మలాకాశపు సౌందర్య చంద్రకాంతులతో కలిసిపోతున్నాయి.

ఆగకుండా సాగిపోతూనే వున్నాయి.

ఆ జనఘోషను ఎవరాపగలరు!

ఆ స్వాతంత్ర్య రథయాత్రను ఆపగల వారెవరు?